ఎన్నికలేవైనా మారని తీరు

నగరంలో సోమవారం ఓటర్ల సందడి లేని పోలింగ్ స్టేషన్

- గ్రామాలతో పోలిస్తే నగరంలో తగ్గుతున్న పోలింగ్ శాతం
- 3,67,353 ఓటర్లకు 2,22,296 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగం

కార్పొరేషన్, మే 14: ఎన్నికల్లో నగర ఓటర్లు తమ బాధ్యతను నిర్వహించడంలో అంతగా ఆసక్తి చూపిస్తున్నట్లు కనిపించడం లేదు. ప్రతి ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లతో పోల్చితే నగరంలోనే పోలింగ్ శాతం తక్కువగానే నమోదు అవుతున్నది. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే తీరు కొనసాగింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 72.54 శాతం పోలింగ్ నమోదు కాగా.. దీని పరిధిలోని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం తప్పించి అన్ని నియోజక వర్గాల్లోనూ 70 శాతానికి పైగా ఓటింగ్ కావడం గమనార్హం. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చొప్పదండిలో 75.36, వేములవాడలో 74.44, సిరిసిల్లలో 75.27, మానకొండూర్‌లో 77.75, హుజూరాబాద్‌లో 73.82, హుస్నాబాద్‌లో 77.25 శాతం నమోదు కాగా, కరీంనగరంలో మాత్రం 60.51 శాతానికి మాత్రమే పరిమిత మైంది. కరీంనగర్‌లో 3,67,353 ఓటర్లు ఉండగా, 2,22,296 మంది మాత్రమే తమ ఓటును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగా ప్రజలు ఓటు వేసేందుకు ముందుకు వస్తుంటే నగర ఓటర్లలో మాత్రం స్పందన కరువవుతున్నది.

కారణాలు అనేకం..

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఓటర్ సిప్పులు కూడా అందలేదన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. అలాగే కొందరు ఓటర్లకు దూర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రం కేటాయించారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి తోడుగా అత్యధికంగా ఓటర్లు తమ ఓటును కరీంనగర్‌తో పాటు వారి సొంత గ్రామాల్లోనూ నమోదు చేసుకున్నట్లు తెలుస్తున్నది. పోలింగ్ రోజు తమ సొంత గ్రామాల్లోనే ఓటు వేస్తుండడం కూడా నగరంలో ఓటింగ్ తగ్గేందుకు ఒక కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అక్షరాస్యులు ఎక్కువగా ఉన్న నగరంలో ఓటు వేసేందుకు ముందుకు రావడంలో నిర్లక్ష్యం కూడా కనిపిస్తుందన్న అభిప్రాయాలు వినవస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలు ఓటు నమోదు చేయించుకోవడంలో చూపించిన ఆసక్తి ఓటు హక్కు వినియోగించుకోవడంలో కొరవడుతున్నదన్న భావన వ్యక్తమవుతున్నది. రానున్న రోజుల్లో నగరంలో కూడా ఓటింగ్ శాతం పెంచే దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్ట్రాంగ్‌రూముల ఎదుట భద్రతను పరిశీలిస్తున్న డీఈవో, ఇతర అధికారులు

సమష్టి కృషితోనే ప్రశాంతంగా ఎన్నికలు

- సహకరించిన అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు
- కరీంనగర్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, మే 14: అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, రాజకీయ నాయకులు, ప్రజల సహకారంతోనే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కరీంనగర్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల క్రతువు ముగియడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ఎస్సారార్ కళాశాలలో మంగళవారం లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నిర్వహించిన సమీక్షలో సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్‌కటారియాతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ, ఈవీఎంల అంశంలో ఏవైనా ఫిర్యాదులుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎలాంటి అనుమానాలున్నా నివృత్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, కరీంనగర్ అసెంబ్లీలో గతంలో కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఎక్కడా ఎలాంటి తప్పిదాలు జరుగకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగడం వల్లే ఇది సాధ్యమైందని, ఇందుకు సహకరించిన ప్రతి అధికారి, ఉద్యోగికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఏఆర్‌వోలు కే మహేశ్వర్, రమేశ్‌బాబు, రాజకీయ పార్టీల నాయకులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, రాజేందర్‌రావు, కొమురయ్య, బండ రమణారెడ్డి, బాస సత్యనారాయణ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూములకు చేరిన ఈవీఎంలు

ఓటర్ల తీర్పును తమలో నిక్షిప్తం చేసుకున్న ఈవీఎంలు జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూములకు చేరాయి. పోలింగ్ ముగిసిన అనంతరం వాటిని పటిష్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు కేంద్రం ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలను సోమవారం అర్ధరాత్రి వరకు చేర్చారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో మంగళవారం ఉదయం స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. ఈ ప్రకియను డీఈవోతో పాటు పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్‌కుమార్ కూడా పర్యవేక్షించారు. ఈవీఎంల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కె.మహేశ్వర్, రమేశ్‌బాబు, రామ్మూర్తి, ఏసీపీలు సతీశ్, శ్రీనివాస్‌జీ, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, కొమురయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మానేరు విద్యార్థుల జయకేతనం

ప్రతిభ చూపిన మానేరు విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, మే 14 : సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్ (సీబీఎస్ఈ) కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులను కైవసం చేసుకుని జయకేతనం ఎగురవేశారని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన 76 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 99 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు పేర్కొన్నారు. మొత్తం 500 మార్కులకు గానూ వై హర్షవర్ధన్ 480 మార్కుల(96 శాతం)తో సత్తా చాటినట్లు తెలిపారు. అలాగే వి.శ్రీజయ 461 మార్కులు, కాజల్ కున్ వార్ 454 మార్కులు, జి. హర్షిణి 438 మార్కులు, కె. శ్రీ అక్షర 428 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు వెల్లడించారు. అదే విధంగా సబ్జెక్టుల్లో పాఠశాల చెందిన విద్యార్థులు అత్యధికంగా సాంఘిక శాస్త్రంలో 99 మార్కులు, తెలుగు , హిందీ, ఇంగ్లిష్‌లలో 96 మార్కులు, సామాన్య శాస్త్రంలో 95 మార్కులు, గణితంలో 88 మార్కులు, ఐటీలో 99 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో అద్వితీయ జీపీఏతో పాటు ఆల్ ఇండియా సేమ్స్ ఒలింపియాడ్‌లో జాతీయస్థాయిలో ర్యాంకులను కైవసం చేసుకొని దేశవ్యాప్తంగా మానేరు విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు పరీక్షల్లో విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలుస్తుండడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంపై మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీతా రెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతా రెడ్డితో పాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వివేకానంద విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, మే 14 : సీబీఎస్ఈ పదో తరగతి, పన్నెండో తరగతుల ఫలితాల్లో వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చూపారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని రేణుక బలివాడ, పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్ రావు పొల్సాని, అకాడమిక్ డైరెక్టర్ టీ లలిత కుమారి పేర్కొన్నారు. 12వ తరగతిలో 16 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని, పదో తరగతిలో 600 మార్కులకు గానూ వి.రేనా రోజ్ లిన్ 579, ఓ జాహ్నవి దేవి 570, శ్రేయాన్స్ ద్వివేది 568, పీ రవి కుమార్, పీ అక్షయ 567 సాధించి పాఠశాల కీర్తిని ఇనుమడింపజేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఇల్లంతకుంట, మే 14: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగడానికి సహకారం అందించిన మండల ఓటర్లకు రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 14 : 2024-25 విద్యా సంవత్సరానికి అత్యుత్తమ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ నతానియేల్ తెలిపారు. మార్చి 2024లో ఎస్సెస్సీలో 7.0 జీపీఏ పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన విద్యార్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఈనెల 30 లోగా ఎస్సెస్సీ ఉత్తీర్ణత మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాసు బుక్కు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బోనోఫైడ్ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు జతపరిచి, http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈపాస్‌లో దరఖాస్తు సమయంలో మూడు ప్రాధాన్యత కళాశాలలు మాత్రమే ఎంపిక చేసుకోవాలని, ప్రక్రియ ముగిసిన అనంతరం ఈపాస్ విధానంలో విద్యార్థుల ఎంపిక పూర్తి చేసి, కళాశాలలు కేటాయించనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

భగీరథ మహర్షి జయంతి వేడుకలు

వల్భాపూర్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న సగర సంఘం నాయకులు

వీణవంక, మే 14: మండలంలోని వల్భాపూర్, శ్రీరాములపేట గ్రామాల్లో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సగర సంఘం ఆధ్వర్యంలో నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నలబాల భిక్షపతి, సమ్మయ్య, సాగర్, మధు, కాటిపల్లి బాబు, స్వామి, ఐలయ్య, ఏరుకొండ ప్రసాద్, దేవునూరి శ్రీనివాస్, మేకల నవీన్, కురిమిల్ల తిరుపతయ్య, కురిమిల్ల రాజయ్య, సగర సంఘం కులస్తులు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డుకు రేకొండ దంపతులు ఎంపిక

ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం అందజేస్తున్న సినీ నటుడు సుమన్, సంస్థ ప్రతినిధులు

చిగురుమామిడి, మే 14: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన డబ్బింగ్ కళాకారులు మాడ సునీల్ రెడ్డి ఆయన సతీమణి కీర్తన ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ, ఎస్ఎన్ మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన 24 గంటల నాన్ స్టాప్ లైవ్ డబ్బింగ్ షోలో వారు పాల్గొని తమ ప్రతిభను చాటారు. మాడ సునీల్ రెడ్డి దంపతులకు స్వర సామ్రాట్ ఆర్‌వీఎం రాజు, ప్రముఖ సినీ నటుడు సుమన్, ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ రాంప్రకాశ్, తెలంగాణ స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ నరేందర్ గౌడ్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, టీ న్యూస్ ప్రజెంటర్ వేముల రాజేశ్ చేతుల మీదుగా రికార్డు సర్టిఫికెట్‌ను అందజేశారు. మండలానికి చెందిన సునీల్‌రెడ్డి దంపతులు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించడంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్, ఎంపీపీ కొత్త వినీత, జడ్పీటీసీ గీకురు రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

చిగురుమామిడి, మే 14: మండలంలోని రేకొండ గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా బండోజు సదానందం, ఉపాధ్యక్షుడిగా పెందోట జగదీశ్వరాచారి, కార్యదర్శి ఎర్రోజు కనకాచారి, సహాయ కార్యదర్శిగా పోలోజు ఆంజనేయులు, కోశాధికారిగా కటుకోజ్వల రామ్మూర్తి, ముఖ్య సలహాదారులుగా బండోజ రమేశ్, ఎర్రోజు చంద్రమౌళి, కటుకొజ్వల రవీందర్, పోలోజు రమేశ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణులు వృత్తిపరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం స్పందించి వాటిని పరిష్కరించాలని కోరారు.

17 నుంచి క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, మే 14 : జిల్లా కేంద్రంలో మే 17, 18, 19 తేదీల్లో సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్క్ చర్చి గ్రౌండ్‌లో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ డాక్టర్ కే రూబెన్ మార్క్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమత శాంతి కోసం ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభల్లో అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ కలిగిన జెన్నీ క్రిస్టాఫర్ హాజరై మాట్లాడుతారని తెలిపారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బీ ప్రసాద్, ఏ మధు మోహన్, పింటు, రోజి, రెనాల్డ్, తిమోతి, క్రిస్టాఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, సంఘాల పెద్దలు, ఇవాంజిలిస్టులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ప్రతిభావంతురాలికి సన్మానం

చొప్పదండి, మే 14 : మండల కేంద్రానికి చెందిన కురిసెంగ అక్షిత ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో పది జీపీఏ సాధించగా మంగళవారం ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వేణు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదికి పది పాయింట్లు సాధించిన అక్షిత ఆదివాసీ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆమె తల్లిదండ్రులైన తిరుపతి– రమాదేవితో పాటు విద్యనందించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయ బృందాన్ని, స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.

ఎలక్ట్రానిక్ పరికరాల చోరీ

చొప్పదండి, మే 14: పట్టణంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఎం+6 టవర్ ఎలక్ట్రానిక్ పరికరాలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి పట్టణంలో సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటులో భాగంగా విద్యుత్ టవర్ నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ సాయితేజ చేపట్టారు. విద్యుత్ పరికరాలను చొప్పదండిలోని సబ్‌స్టేషన్ సమీపంలోని కొత్త చుక్కారెడ్డి ఖాళీ స్థలంలో నిల్వ చేశారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిల్వ ఉంచిన విద్యుత్ పరికరాల్లో సుమారు రూ.8–10లక్షల విలువైన వాటిని చోరీ చేశారు. వీటితో పాటు గదిలో భద్రపరిచిన సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్, హార్డ్‌డిస్కులు, వాటి పక్కన ఉన్న హార్వెస్టర్ రిపేర్‌షాపులో సీసీ కెమెరాల హార్డ్‌డిస్కులను సైతం ఎత్తుకెళ్లారు. కాంట్రాక్టర్ మామ మామిడి మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలిండియా పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, మే 14 : తమిళనాడు రాష్ట్రంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలకు కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి టీ నవీన్‌కుమార్ ఎంపికయ్యాడు. కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుకున్న నవీన్‌కుమార్ ఇటీవల శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బెంచ్ ప్రెస్‌లో 200 కిలోలు, స్కాడ్ విభాగంలో 300 కిలోలు, డెడ్ లిఫ్ట్ విభాగంలో 200 కిలోల బరువును ఎత్తి స్ట్రాంగ్‌మెన్ అవార్డ్‌ను కైవసం చేసుకోవడంతో పాటు ఆలిండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. కాగా, నవీన్‌కుమార్‌ను కళాశాల కరస్పాండెంట్ వీ ఆగంరావు, ప్రిన్సిపాల్ డా. సీహెచ్ శ్రీనివాస్, ఏవో బీ శ్రవణ్‌కుమార్, బీ సంపత్‌కుమార్, బీ రామేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

సెయింట్ జార్జ్ విద్యార్థుల సత్తా

ప్రతిభ చాటిన సెయింట్ జార్జ్ విద్యార్థులు

కొత్తపల్లి, మే 14 : ఇటీవల విడుదలైన సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తాచాటారని విద్యా సంస్థల చైర్మన్ డా. పీ ఫాతిమారెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నేహప్రియ 500 మార్కులకు గానూ 473, పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు 400కి పైగా మార్కులు సాధించారని వెల్లడించారు. అలాగే 12వ తరగతి ఫలితాల్లో జయంత్ 500 మార్కులకు గానూ 448 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు తెలిపారు. పదో, 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీ నిరంజన్, ఏ భార్గవ్, అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, మే 14 : గుమ్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కోలపురి మల్లేశం వడదెబ్బతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. చొప్పదండిలోని తొగరిమామిడి కుంటకు చెందిన మంగలపల్లి అనసూర్య ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కౌన్సిలర్ కొట్టే అశోక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ముద్దసాని రంగన్న, పెరుమండ్ల గంగయ్య, మునిగాల రాజేందర్ తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఇమ్మడి వీరమ్మ (105)ఫైల్

హుజూరాబాద్‌టౌన్, మే14: సామాజిక ఉద్యమకారుడు ఇమ్మడి బాబు మాతృమూర్తి ఇమ్మడి వీరమ్మ (105) మంగళవారం మండలంలోని కందుగులలో మృతి చెందారు. ఇమ్మడి బుచ్చయ్య–రాజమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా, వీరమ్మ కుమారుడు బాబుతోపాటు ఇతర కుటుంబ సభ్యులకు టీజేఏసీ చైర్మన్ ఆవునూరి సమ్మయ్య, కన్వీనర్ హన్మంత్‌గౌడ్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, ఎంపీపీ ఇరుమళ్ల రాణీసురేందర్‌రెడ్డి, లోక్ సత్తా రాష్ట్ర నాయకుడు బెల్లి రాజయ్య, పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'హెచ్‌కేఆర్' నిర్లక్ష్యం.. వాహనదారులకు ప్రాణసంకటం

కొత్తపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఉన్న లారీ

తిమ్మాపూర్, మే 14: రాజీవ్ రహదారిపై చెడిపోయి నిలిచిపోయిన లారీని వారం గడుస్తున్నా తొలగించకపోవడం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్‌కేఆర్ రోడ్ లైన్స్ సంస్థ తీసుకుంటున్న చర్యలను చెప్పకనే చెబుతున్నది. హైదరాబాద్ టూ కరీంనగర్ వైపు వెళ్లే రోడ్డుపై కొత్తపల్లి స్టేజీ వద్ద వారం క్రితం లారీ మరమ్మతులకు గురవగా, వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు గమనించలేని పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయాల పాలవుతున్నారని, హెచ్‌కేఆర్ రోడ్ లైన్స్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడిన నాఫ్స్‌కాబ్ చైర్మన్

గంభీరావుపేట, మే 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దాదాపు నెల రోజులపాటు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తీరిక లేకుండా గడిపారు. పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. అయితే సోమవారం పోలింగ్ పూర్తి కావడంతో మంగళవారం సాయంత్రం గజసింగవరంలో బ్యాట్ పట్టి.. కాసేపు క్రికెట్ ఆడి చిన్నారుల్లో ఉత్సాహం నింపారు.

క్రీడాకారిణికి అభినందన


సిరిచందనను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, మే 14 : హాంకాంగ్‌లో ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 52 కిలోల విభాగంలో మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిగడ్డకు చెందిన తూడి సిరిచందన 325 కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని సాధించింది. కాగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం సిరిచందనను కరీంనగర్‌లో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. ఇక్కడ నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, పురుమల్ల మనోహర్, ముద్దం రమేశ్, మల్లారెడ్డి, తిరుపతి రెడ్డి, చిలుముల రమేశ్, రాజమల్ల భాస్కర్, నారాయణ, తిరుపతి, మహేశ్, అరవింద్, మల్లేశ్, గంగరాజు, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు

జమ్మికుంట, మే14: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే స్వర్ణోత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం తొలిరోజు వేడుకలకు విశ్రాంత సహాయ సంచాలకుడు డాక్టర్ చేరాలు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేడుకలు ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. కేవీకేను 1974లో ప్రారంభించారని, అలా దేశవ్యాప్తంగా కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు. కేవీకేలు రైతులకు, పరిశోధన సంస్థలకు మధ్య వారధిలా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోని రైతులు ఆర్థిక స్థిరత్వాన్ని ఏర్పరుచుకునే విధంగా వివిధ వ్యవసాయ అనుబంధ రంగాలతో స్వచ్ఛంద సంస్థలతో కలిసి కేవీకేలు పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. దేశంలో 731 కేవీకేలు పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో 16 ఉండగా మరో 15 కేవీకేలు త్వరలో ప్రారంభంకానున్నాయని చెప్పారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడంలో కేవీకేల పాత్ర గొప్పదన్నారు. ఇక్కడ వ్యవసాయ పాలిటెక్నిక్ అధ్యాపకులు, కేవీకే శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీవో రైతులు, తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల రిలాక్స్


భగత్‌నగర్‌లోని తన ఇంట్లో కార్యకర్తలు, అభిమానులతో సరదాగా మాట్లాడుతూ టీ తాగుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్


చైతన్యపురిలో అల్లుడితో కలిసి బైక్‌పై వెళ్లి బేకరీలో స్నాక్స్ తింటున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్


సరస్వతీనగర్‌లోని తన నివాసంలో భార్య, కూతురు, మనుమరాళ్లతో సరదాగా గడుపుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా దాదాపు నెల రోజులకు పైగా బిజీ బిజీగా గడిపిన అభ్యర్థులు సోమవారం పోలింగ్ ముగియడంతో రిలాక్స్ అయ్యారు. మంగళవారం తమ ఇళ్లలోనే కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో సరదాగా గడిపారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ భగత్‌నగర్‌లోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి టీ తాగుతూ పోలింగ్ సరళి, ఎక్కడెక్కడ ఎంత శాతం నమోదు అయిన విషయాలపై చర్చించారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చైతన్యపురిలో తన మేనల్లుడితో కలిసి బైక్‌పై ఓ బేకరికి వెళ్లి స్నాక్స్ తింటూ సరదాగా గడిపారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సరస్వతీనగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి మామిడి పండ్లు తింటూ కబుర్లు చెప్పుకొంటూ గడిపారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్